**ఏ దుఃఖమూ శాశ్వతం కాదంటారు. వరదంత వ్యథ తర్వాత మెరుపంతైనా మంచి జరుగుతుందంటారు. పుట్టిన్నాడు ఏడ్చే ఉంటాను. ఆ వెంటనే అమ్మను గుర్తుపట్టిన్నాడు నవ్వేనట. జ్వరంతో ఉన్న బిడ్డను ఒళ్లో వేసుకుని.. నాకోసం మీ అత్త వీధిలో రాత్రంతా చూస్తున్నప్పుడు, ఎవరో ఎప్పుడో వస్తారని, ఎక్కడో రోడ్డు మీద బందోబస్తు డ్యూటీలో పడిగాపులు పడిన్నాడు ఏడ్చాను. ఆ మర్నాడు వాడికి తగ్గాక తేరుకున్నాను. టెన్త్‌లో వాడు తాలూకా ఫస్ట్ వచ్చి ప్రైజ్ అందుకున్ననాడు.. స్వయంగా చూడ్డానికి లేకుండా ఎవరో తాగుబోతులిద్దరూ కొట్టుకు చస్తే, శవ పంచానామా దగ్గర చిక్కడిపోయిన్నాడు ఏడ్చాను. ఇంటికొచ్చాక.. వాడి కళ్లలో ఆనందం చూసి సరిపెట్టుకున్నాను.**




పొరబాటున చెయ్యి తగిలినందుకే.. ఆ అమ్మాయి ఇలా కేసు పెట్టడం అన్యాయం సర్!'' అన్నాడు బాధగా.

దానికతను తాపీగా..

''మాస్టారూ! కేవలం ఒక్క ఇన్సిడెంట్ వల్లే మీరు ఇక్కడివరకూ వచ్చారంటారా? మీ గురించి మీకు తెలీదా!? లేదా కనీసం ప్రిలిమినరీ ఎంక్వయిరీ కూడా చెయ్యకుండానే మిమ్మల్ని పిలిపించామంటారా? మీ 'అకాడమిక్ ఎరోగెన్సీ' వల్ల అప్పుడే జాయిన్ అయిన పిల్లల్ని నలుసుల్లా చూస్తారు. మీరే మీ క్లాస్‌కు రాజు. మిమ్మల్ని అడిగేవాడు ఉండడు. ప్రశ్నించే వాడుండడు. వాళ్లను బాణంలా సంధిచాల్సిన మీరే.. బాధల్లో బంధించేస్తారు. చీమల్ని చేత్తో నలిపినట్టు, తూనీగ తోకకు దారంతో రాయికట్టినట్టు.. మీ ఇష్టం! మీరు ఏదైనా చెయ్యొచ్చు. కెరీర్ కోసం, కన్నవాళ్ల కోసం, మీరు ఏం చేసినా.. వాళ్లు మౌనంగా భరించాలి. ఎప్పుడైనా, ఎవరికైనా.. భరోసాగా భుజం మీద చెయ్యేసి ఓ మంచిమాట చెప్పారా? మునుపెన్నడూ చదవని టెక్నికల్ సబ్జెక్ట్స్ అర్థం కాక, మిమ్మల్ని అడిగే ధైర్యం లేక, అప్పటివరకూ తల్లిదండ్రుల పెంపకంలో పెరిగి, ఒక్కసారిగా ఊరు కాని ఊర్లో హాస్టల్‌లో తమను తాము మేనేజ్ చేసుకుంటూ, పదిహేడేళ్ల వయసులో ఎంత ఒత్తిడితో ఉంటారో.. ఎప్పుడైనా ఒక్కసారి వాళ్ల కళ్లల్లోకి చూస్తే తెలుస్తుంది మీకు. ఆ క్లాస్‌రూమ్ దాటితే.. బైట మీరూ అందరిలాంటి వాళ్లే! ఆ నాలుగేళ్లూ దాటితే.. వాళ్లూ మీలా గొప్పవాళ్లే!''..

అతను చెబుతూ ఉండగా..

'అనువుగాని చోట'.. పద్యం చదివిన వాడిలా, తల దించుకుని వింటున్నాడు సభాపతి.

ఏసీపీ కొంచెం ముందుకు వంగి..

''మాస్టారూ! మన దేశంలో గంటకో విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నాడు తెలుసా!? దానికి గల అనేక కారణాల్లో 'ఫ్యాకల్టీ ఎరోగన్సీ' ఒకటి అని సర్వేలు చెబుతున్నాయి. నాలుగేళ్ల కోర్స్‌లో ఓ స్టూడెంట్ సగటున ఇరవై మంది ఫ్యాకల్టీని ఫేస్ చెయ్యాలి. అందులో పంతొమ్మిది మంది మంచివాళ్లున్నా సరే.. మీలాంటి వాళ్లు ఒక్కరు తగిలితే చాలు!''

అంటూ ఓసారి నిట్టూర్చి,

''అయినా.. రిఫరెన్స్‌తో వచ్చారు కాబట్టి ఎఫ్ఐఆర్ రాయకుండా ఓ రెండ్రోజులు ఆపుతా. ఈలోగా ఆ అమ్మాయికి అపాలజీ చెప్పి, కంప్లయింట్ విత్‌డ్రా చేసుకోమని రిక్వెస్ట్ చేసుకోండి. ఒప్పుకొంటే చూద్దాం! వెళ్లండి!'' అంటూ బెల్ కొట్టాడు.

''సర్! నేను ప్రొఫెసర్‌ని అని చెబుతున్నా కూడా వినకుండా.. మీ కానిస్టేబుల్ నా బట్టలూడదీయించి కూర్చోబెట్టాడు'' అన్నాడు సభాపతి రోషంగా. అలా చెబుతున్నప్పుడు అతని ముక్కుపుటాలు అదిరాయి.

''మాస్టారూ! బట్టలు పెట్టి పంపడానికి మీరిక్కడికి అతిథిగా రాలేదు. అక్యూజ్డ్‌గా వచ్చారు. అయినా వాళ్లు మీ అంత చదువుకున్నవాళ్లు కాదు కదా! అలాగే రూడ్‌గా ఉంటారు. అట్టే విసిగించక వెళ్లండి!''.. వ్యంగ్యమూ, విసుగూ కలబోతగా అంటూ లేచి వెళ్లిపోయాడు ఏసీపీ.

* * *

ఉదయం పదిగంటలు. పోలీస్ హెడ్ క్వార్టర్స్.

''ఏమయ్యా! కోరి ఆ స్టేషన్‌కు పోస్టింగ్ వేయించుకున్నావు. ఆ ప్రొఫెసర్ విషయంలో నీ ప్రవర్తనకు ఓరల్ వార్నింగ్ ఇమ్మన్నాను అంతే! ఎంక్వయిరీ కూడా వద్దనే చెప్పాను. మరెందుకు ఈ రిజిగ్నేషన్? నీ గురించి తెలుసు కాబట్టి ఇదంతా. లేదంటే ఈ విషయం నావరకూ రానవసరం కూడా లేదని తెలుసు నీకు?'' విసుగ్గా అన్నాడు పోలీస్ బాస్.. ఫైల్ పక్కన పెడుతూ.

''అదేం లేదు సర్! హెల్త్ అంతగా బావుండటం లేదు సర్ అంతే! ఉంటాను సర్. థాంక్యూ సర్!'' అంటూ సెల్యూట్ చేసి, అలాగే అడుగులు వెనక్కి వేస్తూ బయటకొచ్చేసరికి అమ్ములు ఫోన్.

''ఆ మావయ్యా! ఎక్కడున్నారు? వంట చేసేసి అన్నీ టేబుల్ మీదే పెట్టాను''.

''పనైపోయిందమ్మా వచ్చేస్తున్నా!''.

''ఉద్యోగం మానేస్తున్నందుకు బాధగా ఉందా మావయ్యా? మనమేమన్నా తప్పు చేశామా? ఆ విషయం అంతటితో వదిలేయాల్సిందా!?'' అన్నది అమ్ములు దిగులుగా.

''అదేం లేదమ్మా!''.. అంటూ అతను ఆఫీస్ బయట చెట్టు కింద ఉన్న చప్టా మీద కూర్చుని.. ఉక్కపోతగా ఉంటే చొక్కా పైబొత్తాయి విప్పి, కొంచెం వెనక్కి జారబడి, నెమ్మదిగా తనలో తను అనుకుంటున్నట్టు చెప్పసాగాడు.

''ఏ దుఃఖమూ శాశ్వతం కాదంటారు. వరదంత వ్యథ తర్వాత మెరుపంతైనా మంచి జరుగుతుందంటారు. పుట్టిన్నాడు ఏడ్చే ఉంటాను. ఆ వెంటనే అమ్మను గుర్తుపట్టిన్నాడు నవ్వేనట. జ్వరంతో ఉన్న బిడ్డను ఒళ్లో వేసుకుని.. నాకోసం మీ అత్త వీధిలో రాత్రంతా చూస్తున్నప్పుడు, ఎవరో ఎప్పుడో వస్తారని, ఎక్కడో రోడ్డు మీద బందోబస్తు డ్యూటీలో పడిగాపులు పడిన్నాడు ఏడ్చాను. ఆ మర్నాడు వాడికి తగ్గాక తేరుకున్నాను. టెన్త్‌లో వాడు తాలూకా ఫస్ట్ వచ్చి ప్రైజ్ అందుకున్ననాడు.. స్వయంగా చూడ్డానికి లేకుండా ఎవరో తాగుబోతులిద్దరూ కొట్టుకు చస్తే, శవ పంచానామా దగ్గర చిక్కడిపోయిన్నాడు ఏడ్చాను. ఇంటికొచ్చాక.. వాడి కళ్లలో ఆనందం చూసి సరిపెట్టుకున్నాను. చెయ్యని తప్పుకి రెక్క పట్టుకుని పరీక్ష హాల్‌లోంచి ఈడ్చుకెళ్లి మరీ ఫెయిల్ చేసినప్పుడు.. వాడు ఉప్పెనొచ్చినట్టు ఏడుస్తూ ఉంటే, ఎలా ఊరుకోపెట్టాలో తెలీక మళ్లీ ఏడ్చాను. ఎప్పటిలాగానే.. 'ఇది కేవలం తాత్కాలికం! ఓ రోజుల్లో అంతా సర్దుకుంటుంది' అనుకున్నాను. కానీ, ఆ మర్నాడే వాడు తిరగని ఫ్యాన్‌ను తిరిగి రాని లోకాలకు వెళ్లిపోడానికి వాడుకున్నప్పుడు.. నా దుఃఖం శాశ్వతమని తెలిసి, కన్నీళ్లు ఇంకిపోయేలా ఏడ్చాను. నా బిడ్డ ఆత్మహత్యకు కారణమైనవాడు ఇంకెవర్నీ ఇబ్బంది పెట్టకుండా.. ఆమాత్రం బుద్ధి చెప్పగలిగాం! అది చాలు. అదేం తప్పు కాదు తల్లీ! అయినా 'ప్రేమలోనూ, పోరులోనూ అంతా నైతికమే!' అని ఎవరో పెద్దాయన చెప్పాడని నువ్వే చెప్పావ్ కదా. సరే! బయల్దేరతాను. రేపట్నుంచి ఇంట్లోనేగా! నేనే వంట చేస్తాలే!''.. అంటూ భారంగా అడుగులేస్తూ, ఇంటిదారి పట్టాడు శంకర్రావు, పీసీ 763 (రిటైర్డ్). ■

## ఉమా మహేష్ ఆచాళ్ల



'కథ వల్ల కనీసం రచయిత అయినా మారతారు!' అంటారు ఉమా మహేష్ ఆచాళ్ల. కేంద్ర కస్టమ్స్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం చేస్తూనే.. సమాజహితం కోరే కథలు రాస్తున్నారీయన. స్వస్థలం తూర్పు గోదావరి (ప్రస్తుతం కాకినాడ జిల్లా) తుని. ఉద్యోగరీత్యా విశాఖలో ఉంటున్నారు. మొదటి కథ.. 'మా తుఝే సలాం' 2016లో 'వార్త'లో ప్రచురితమైంది. ఇప్పటివరకూ దాదాపు 45 కథలు ప్రముఖ పత్రికల్లో వచ్చాయి. వీటిలో 21 కథలను.. 'సంఘే శక్తి కలియుగే' శీర్షికతో కథా సంపుటి వెలువరించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ చేతుల మీదుగా స్వర్ణ పతకం, ప్రశంసాపత్రం అందుకున్నారు. 'తెల్సా 2022 కథల పోటీ'లో బహుమతి దక్కించుకున్నారు. ఈనాడు 'కథా విజయం – 2019'లో 'భువి కోరని భ్రమణం' కథకు, 2020లో 'అడ్డుగోడ' కథకు బహుమతులు గెలుపొందారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం కథల పోటీల్లో 'వానకారు కోయిల' , 'ఇంకా తెలవారదేమీ' , 'నైతికానైతికం' కథలకు వరుసగా బహుమతులు అందుకున్నారు. 'ఇంకా తెలవారదేమీ' కథ.. కన్నడంలోకి అనువాదమై, అక్కడా ప్రశంసలు పొందింది.